సాక్షి సంగారెడ్డి

గురువారం । 1 । ఫిబ్రవరి । 2024



దోచేస్తున్నారు

హుస్నాబాద్‌లో నెల రోజులుగా వరుస దొంగతనాలు పోలీసులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

వివరాలు 8లో ▸



గంజాయి చాక్లెట్ల పట్టివేత

చేర్యాలలో 6 కిలోల గంజాయి చాక్లెట్లు.. మల్కాపూర్‌లో ఎండు గంజాయిని విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. వివరాలు 8లో ▸



అదనపు బస్సులకు ప్రతిపాదన

ఖేడ్ ఆర్టీసీ డిపో పరిధిలో వివిధ రూట్లలో బస్సు సౌకర్యం కోసం ఎమ్మెల్యే సంజీవరెడ్డి డీఎంకు ప్రతిపాదనలను అందజేశారు.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక



కప్‌తో విద్యార్థినులు, పీఈటీ రాములు యాదవ్

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని కృష్ణాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యారు. గజ్వేల్‌లో ఇటీవల ఉమ్మడి మెదక్ జిల్లా బాలికల విభాగం సీనియర్ ఖోఖో పోటీలు జరిగాయి. పాఠశాలకు చెందిన విద్యార్థినులు వర్ష, సంయుక్త, కవిత, పూజ ఉత్తమ ప్రతిభ కనబరిచి ఈనెల 9, 10, 11 తేదీల్లో భువనగిరిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. బుధవారం హెచ్‌ఎం రాంమోహన్‌రావు విద్యార్థినులు, పీఈటీ రాములుయాదవ్‌ను అభినందించారు.

ఎంపీ ఎన్నికల్లో సత్తా చాటాలి



మాట్లాడుతున్న గోదావరి

రామచంద్రాపురం(పటాన్‌చెరు)/సంగారెడ్డి: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని ఆపార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని ఆమె నివాసంలో తెల్లాపూర్ మున్సిపాలిటీకి చెందిన నాయకులు కలిసి సన్మానించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రధాని మోదీతోనే దేశం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. కేంద్ర పథకాలను గడపగడపకు వెళ్లి వివరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రాజు, సీనియర్ నాయకులు రాజేందర్‌రెడ్డి, నరసింహారెడ్డి, రాంబాబు, మాణిక్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా పార్టీ కార్యాలయంలో 'గావ్ చలో అభియాన్' వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కార్యక్రమ రాష్ట్ర ఇంచార్జ్ రంజిత్ మోహన్, జిల్లా కన్వీనర్ హనుమంత్‌రెడ్డి, కో కన్వీనర్ చంద్రశేఖర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, బీజేపీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

పల్లెల రూపురేఖలు మార్చాం



కమ్యూనిటీహాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: కేసీఆర్ నాయకత్వంలో గ్రామీణ ప్రాంతాల రూపురేఖలు మార్చామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు మండలం పెద్దకంజర్ల, చిన్నకంజర్ల గ్రామాల్లో రూ. 3.70 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్లు, మహిళా భవనం, కమ్యూనిటీ హాల్‌ను బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే రో జుల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేపడుతామని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సుప్రజ, సర్పంచ్‌లు రాజ్‌కుమార్, నారాయణరెడ్డి, ఎంపీటీసీ వెంకటరెడ్డి, పంచాయతీరాజ్ డీఈ సురేష్, నాయకులు దశరథరెడ్డి, వెంకట్‌రెడ్డి, ఉపసర్పంచ్ హరిశంకర్‌గౌడ్, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని ఖాజీపల్లిలో రోడ్డు పక్కన ఎలాంటి అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన నిర్మాణాలను బుధవారం రెవెన్యూ అధికారులు కూల్చివేయించారు. తహసీల్దార్ రవికుమార్ ఆదేశాల మేరకు ఆర్‌ఐ జయప్రకాశ్ నారాయణ ఆధ్వర్యంలో కూల్చివేతల కొనసాగాయి. ప్రభుత్వ భూముల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా కఠిన చర్యలు తప్పవని ఆర్‌ఐ హెచ్చరించారు.

మహాసభలకు తరలిరండి: టీపీటీఎఫ్

జహీరాబాద్ టౌన్: ఈనెల 11, 12 తేదీల్లో ఖమ్మంలో నిర్వహించ తలపెట్టిన తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ద్వితీయ విద్యా వైజ్ఞానిక మహా సభలను విజయవంతం చేయాలని యూనియన్ జిల్లా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, రాంచందర్ పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలో మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. విద్యార్థుల సంక్షేమం కోసం తమ యూనియన్ కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కరువయ్యాయని వాపోయారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు జనార్దన్‌రెడ్డి, బిచ్చయ్య, నాగేశ్వర్‌రావు, లక్ష్మయ్య, జీవన్‌రావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హామీలు పట్టాలెక్కేనా?

కేంద్ర బడ్జెట్‌పై ఉమ్మడి మెదక్ జిల్లా ప్రజల్లో కోటి ఆశలు నెలకొన్నాయి. పాలకుల హామీలు ఈ సారైనా 'పట్టా'లెక్కుతాయని ఆశిస్తున్నారు. రైల్వే లైన్లకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చే విషయంపై ఆసక్తి నెలకొంది. పెండింగ్‌లో ఉన్న రైల్వే ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పనులను ప్రారంభిస్తారా? లేదా? అన్నది అందరిలో సందిగ్ధంగా మారింది. ఇప్పటికే ఎంపీ బీబీ పాటిల్, మాజీ ఎంపీ, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డిలు రైల్వే మంత్రి దృష్టికి సైతం తీసుకువెళ్లారు.



చేగుంటలో రైల్వే గేటు తీయడంతో వెళ్తున్న వాహనాలు

సాక్షి, సిద్దిపేట/ మెదక్: పటాన్‌చెరు (వట్టినాగులపల్లి) – సంగారెడ్డి– జోగిపేట మీదుగా మెదక్ వరకు 90కిలోమీటర్ల రైల్వేలైన్ కోసం 22 యేళ్లుగా స్థానికులు పోరాటం చేస్తున్నారు. ఈ లైన్‌ను నిర్మిస్తే నార్త్ టూ సౌత్ కలిపే విధంగా ఉంటుంది. 2018లో మంజూరై సర్వే సైతం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంతో ముందుకు సాగడం లేదు. నిత్యం నారాయణఖేడ్, సదాశివపేట, జోగిపేట, సంగారెడ్డిల నుంచి హైదరాబాద్‌కు సుమారు 50వేల మందికి పైగా రాకపోకలు సాగిస్తుంటారు. ఈ లైన్ నిర్మిస్తే పరిశ్రమల్లో తయారయ్యే ప్రొడక్ట్‌లు ఎక్స్‌పోర్ట్ సైతం కానున్నాయి. అలాగే వట్టినాగులపల్లి నుంచి ఆదిలాబాద్ వరకు రైల్వే లైన్‌ను నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

కేంద్రీయ విద్యాలయం, నవోదయ వచ్చేనా..

ప్రతీ జిల్లాలో నవోదయ ఏర్పాటు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు ఏర్పాటు చేయలేదు. మెదక్ జిల్లాకు నవోదయ, కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేస్తే విద్యా పరంగా మరింత అభివృద్ధి చెందనుంది.

పర్యాటకంగా..

మెదక్ జిల్లా కేంద్రంలో ఖిల్లా, ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మెదక్ చర్చి, ప్రసిద్ధి చెందిన ఏడుపాయల, పోచారం అభయారణ్యం, దానిపక్కనే పోచారం ప్రాజెక్టు, కొల్చారం మండల కేంద్రంలో గల జైన మందిరాలు చూడదగిన ప్రాంతాలు. వీటిని పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది.

విద్యుద్ధీకరణ జరిగేనా?

సికింద్రాబాద్ నుంచి సిద్దిపేట వరకు రైళ్ల రాకపోకలు సాగుతున్నాయి. ఎన్నో ఏళ్ల కల గత ఏడాది అక్టోబర్ 4న నెరవేరింది. రోజూ ఉదయం, మధ్యాహ్నం సమయాల్లో సికింద్రాబాద్‌కు రైలు రాకపోకలు సాగిస్తోంది. రూ.1200 కోట్లతో రైల్వే లైన్‌ను నిర్మించారు. ప్రస్తుతం డీజిల్ ఇంజన్ ద్వారానే రాకపోకలు కొనసాగుతున్నాయి. అదే విద్యుద్ధీకరణ చేస్తే ఎక్స్‌ప్రెస్ రైళ్లు కూడా అందుబాటులోకి వచ్చే అవకాశాలుంటాయి. సికింద్రాబాద్ వరకు వచ్చే పలు రైళ్లను సిద్దిపేట వరకు పొడిగించవచ్చు. ఇప్పటికే పర్యాటకంగా, సాగు, పరిశ్రమల రంగంలో సిద్దిపేట ముందు వరుసలో ఉంది. లైన్ విద్యుద్ధీకరణకు నోచుకుంటే మరింత అభివృద్ధి చెందే అవకాశం. అలాగే మెదక్ నుంచి రోజుకు రెండు సార్లు సికింద్రాబాద్‌కు మాత్రమే నడుస్తున్నాయి. ఇక్కడి నుంచి తిరుపతి, షిరిడీలాంటి పుణ్యక్షేత్రాలకు రైలు నడపాలని ప్రజలు కోరుతున్నారు.



● గేటు పడితే తప్పని నిరీక్షణ

మెదక్–చేగుంట ప్రధాన రహదారి చేగుంటలో రైల్వేగేటు పడితే గంటల తరబడి వాహనాలు నిలిచి పోతున్నాయి. ఫ్లైఓవర్ నిర్మిస్తే ఇబ్బందులు తప్పనున్నాయి. ఈ క్రమంలో అత్యవసర 108 లాంటి వాహనాలు నిలిచి పోయి నరకయాతన పడిన సందర్భాలు అనేకం. 2022లో మెదక్–అక్కన్నపేట కొత్తగా నిర్మించిన రైల్వేలైన్ ప్రారంభోత్సవానికి వచ్చిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి ఫ్లైఓవర్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం ఇచ్చారు. కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈసారైనా నిధులు కేటాయిస్తారా? లేదా? అని ఆశగా ఎదురు చూస్తున్నారు.

కేంద్ర బడ్జెట్‌పై కోటి ఆశలు

- ఊరిస్తున్న నార్త్ టూ సౌత్ కలిపే రైల్వేలైన్..
- వట్టినాగులపల్లి– ఆదిలాబాద్ లైన్‌పై 22 ఏళ్లుగా పోరాటం
- మనోహరాబాద్ నుంచి సిద్దిపేట వరకు రైల్వేలైన్ విద్యుద్ధీకరణ జరిగేనా?
- మెదక్– చేగుంట ప్రధాన రహదారిలో తప్పని 'గేట్' తిప్పలు
- మెదక్ జిల్లాకు నవోదయ, కేంద్రీయ విద్యాలయాలపైనా ఆసక్తి

22 యేళ్లుగా పోరాటం



పటాన్‌చెరు (వట్టినాగులపల్లి) నుంచి మెదక్ వరకు 90 కిలో మీటర్ల రైల్వే లైన్ కోసం 22 యేళ్లుగా పోరాటం చేస్తున్నాం. ఈ లైన్‌కు కోసం రైల్వే మంత్రులకు వినతి పత్రాలు అందజేశాం. 2018లో రైల్వే అధికారులు స్పందించి సర్వే చేసి రూ.1700 కోట్లు అవసరమని అంచనాలు సైతం సిద్ధం చేశారు. కానీ బడ్జెట్‌లో నిధులు ఇప్పటి వరకు కేటాయించలేదు. ఈ సారైనా నిధులు కేటాయించాలని కోరుతున్నాం.

– గంగ జోగినాథ్, జోగిపేట

ఆదాయ పరిమితి రూ.10 లక్షలకు పెంచాలి



ప్రస్తుతం ఉద్యోగులకు రూ.5 లక్షల వరకు మాత్రమే ఆదాయ పరిమితి ఉంది. దీనిని రూ.10 లక్షల వరకు పెంచాలి. అలాగే స్లాబ్ రేట్లను సవరించాలి. 80(సీ) పన్ను మినహాయింపు రూ.2.50 లక్షలు ఉంది. రూ.5 లక్షల వరకు పెంచాలి. గృహ రుణ పన్ను మినహాయింపు రూ.3 లక్షలకు పెంచాలి.

– వెంకటరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి, టీపీటీఎఫ్

నేరాల అదుపునకు కృషి చేయండి

ఎస్పీ చెన్నూరి రూపేష్



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎస్పీ రూపేష్

సంగారెడ్డి: జిల్లాలో నేరాలను అదుపు చేయడమే పోలీసుల ప్రథమ కర్తవ్యం అని ఎస్పీ రూపేష్ అన్నారు. బుధవారం జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఒక్కో విభాగానికి ఒక్కో నోడల్ అధికారిని నియమించినట్లు తెలిపారు. ఆయా విభాగాలకు సంబంధించి నోడల్ అధికారులే పూర్తి బాధ్యతలు తీసుకోవాలన్నారు. మహిళలపై జరుగుతున్న వివిధ రకాల నేరాలకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా ఈ బృందాలు పనిచేస్తాయని వివరించారు. అమాయక ప్రజలను ఆసరాగా చేసుకొని సైబర్ నేరగాళ్లు వివిధ రకాల నేరాలకు పాల్పడుతున్నారని అన్నారు. జిల్లా ప్రజలను అప్రమత్తం చేయడానికి కళా బృందాలతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందాలు జిల్లాలో ఎలాంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరగకుండా చూడాలన్నారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

పత్తి రైతుల ఆందోళన



ఆందోళనకారులతో మాట్లాడుతున్న మార్కెట్ కార్యదర్శి

సదాశివపేటరూరల్(సంగారెడ్డి): నేటి నుంచి సీసీఐ కొనుగోళ్లు ఆపేస్తామని అధికారులు చెప్పడంతో బుధవారం మండల పరిధిలోని ఆత్మకూర్ రోడ్డులో గల కొనుగోలు కేంద్రాల ఎదుట రైతులు ఆందోళన చేశారు. కొనుగోళ్లు ఆపొద్దని రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో అధికారులు దిగొచ్చారు. సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో పత్తి నిల్వలు పేరుకుపోవడంతో ఈనెల 1వ తేదీ నుంచి 7 వరకు తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు సదాశివపేట మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. రైతులు అధైర్యపడొద్దని.. పత్తిని మొత్తం కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గొల్లపల్లి జయరాజు మాట్లాడుతూ.. సీసీఐ కొనకపోవడంతో ప్రైవేట్ వ్యాపారులు పెద్ద ఎత్తున దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు భూషణం, ఏసోబు, ప్రసాద్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పండుగలా పాత పంటల జాతర



ఊరేగింపులో మహిళా రైతుల నృత్యం

జహీరాబాద్: పాత పంటల జాతర పండుగలా సాగుతోంది. పట్టణంలోని ప్రధాన రహదారుల గుండా బుధవారం ఎడ్లబండ్ల ఊరేగింపు నిర్వహించగా మహిళా రైతుల నృత్యం ఆకట్టుకుంది. ఈసందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో మండలస్థాయి పాత పంటల జాతర నిర్వహించారు. ఏఓ ప్రవీణ, కళాశాల ప్రిన్సిపాల్ అస్లాం ఫారూకి ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. జహీరాబాద్ ప్రాంతంలో చిరుధాన్యాల పంటల సాగు కోసం డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యులు చేస్తున్న కృషి ఎనలేనిదని కొనియాడారు. చిరుధాన్యాల సాగుతో భూములు సారవంతం అవుతున్నాయని, వాతావరణ కాలుష్యం లేకుండా ఉంటుందన్నారు. చిరుధాన్యాలతో ఆరోగ్యానికి మేలని పేర్కొన్నారు. కార్యక్రమంలో లెక్చరర్ రాములు, డీడీఎస్ సిబ్బంది చుక్కమ్మ, పూలమ్మ, చిన్న నర్సమ్మ, మంజూల, విజయలక్ష్మి, జనరల్ నర్సమ్మ, లక్ష్మమ్మ, అల్గోల్ నర్సమ్మ, చంద్రమ్మ, వినయ్‌కుమార్, బాలయ్య, మొగులమ్మ, కమలమ్మ, లయ, మహిళా రైతులు పాల్గొన్నారు.

ప్రగతిపై ప్రత్యేక దృష్టి సారించాలి

- కలెక్టర్ వల్లూరి క్రాంతి
- నారాయణఖేడ్‌లో అధికారులతో సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరి క్రాంతి, చిత్రంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి

నారాయణఖేడ్/కల్హేర్(నారాయణఖేడ్): జిల్లాలో వెనుకబడిన నారాయణఖేడ్ నియోజకవర్గ అభివృద్ధిపై జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి సూచించారు. నారాయణఖేడ్ మండలం జూకల్ శివారులోని కన్వెన్షన్ హాల్‌లో జిల్లా, డివిజన్, మండలస్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రధానంగా విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ఖేడ్ ప్రాంతీయ ఆస్పత్రిలో 67శాతం ప్రసవాలు మాత్రమే జరగడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అన్ని సదుపాయాలు ఉన్నందున 80 నుంచి 90శాతం ప్రసవాలు జరిగేలా చూడాలని ఆదేశించారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో ప్రసవాలు జరిగితే సంబంధిత ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి మాట్లాడుతూ.. విద్యుత్‌శాఖలో సమస్యలు అధికంగా ఉన్నాయని.. సబ్‌స్టేషన్ల ఆపరేటర్లు అధికారుల నియంత్రణలో ఉండడం లేదని తెలిపారు. కలెక్టర్ స్పందిస్తూ విద్యుత్ అధికారులపై ఆరోపణలు అధికంగా ఉన్నాయని, సమస్యలు లేకుండా చూడాలన్నారు. తాగునీరు అన్ని గ్రామాలకు వెళ్లేలా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, ఆర్డీఓ శ్రీనివాస్‌రావు, డీపీఓ సురేశ్ మోహన్, డీఆర్డీఏ పీడీ శ్రీనివాస్‌రావు, డీఈఓ వెంకటేశ్వర్లు, వివిధ శాఖల జిల్లా, డివిజన్ అధికారులు పాల్గొన్నారు. అలాగే సిర్గాపూర్ మండల కేంద్రంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డితో కలిసి కలెక్టర్ క్రాంతి పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు.

జీపీలకు ప్రత్యేక అధికారులు

జిల్లాలోని అన్ని పంచాయతీల్లో ఈనెల 2వ తేదీ నుంచి ప్రత్యేక అధికారులను నియమించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. మండలంలోని పంచగామలో రూ. 16 లక్షల వ్యయంతో నిర్మించిన పంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే సంజీవరెడ్డితో కలిసి బుధవారం ప్రారంభించారు. అనంతరం జూకల్ శివారులోని మోడల్ డిగ్రీ కళాశాలలో స్ట్రాంగ్‌రూం, డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను కలెక్టర్ పరిశీలించారు.

అధికారికంగా ఇక గద్దర్ జయంతి

- ధరణి స్థానంలో కొత్త రెవెన్యూ విధానం..
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి
- రామచంద్రాపురంలోని తెల్లాపూర్‌లో గద్దర్ విగ్రహావిష్కరణ



తెల్లాపూర్‌లో జరిగిన గద్దర్ విగ్రహావిష్కరణలో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి తదితరులు

రామచంద్రాపురం: దివంగత గద్దర్ జయంతిని ఇక అధికారంగా నిర్వహిస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. బుధవారం రాత్రి సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం మండలం తెల్లాపూర్‌లో గద్దర్ గళం వ్యవస్థాపకులు కొల్లూరి సత్తయ్య, స్వతంత్ర కౌన్సిలర్ భరత్ ఆధ్వర్యంలో గద్దర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో భట్టి మాట్లాడుతూ ఇక ప్రతి ఏడాది ఆయన జయంతిని ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఇందిరమ్మ రాజ్యం తీసుకురావడానికి ప్రోత్సహించిన వ్యక్తి గద్దర్ అని గుర్తు చేశారు. ఆయన ఆలోచనలను, ఆశయాలను అమలు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. గద్దర్‌తో ఆయనకున్న అనుబంధాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.

ధరణిని స్థానంలో కొత్త రెవెన్యూ విధానం..

ధరణిని తొలగించి ఆ స్థానంలో రెవెన్యూ విధానం తీసుకొస్తామని ప్రకటించారు. దీనిపై చాలా లోతైన ఆలోచన చేశామన్నారు. కానీ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం తరతరాల నుంచి వస్తున్న భూములను భూ స్వాములకు అప్పజెప్పాలని ధరణి పోర్టల్‌ను తీసుకొచ్చిందన్నారు. దీంతో అనేకమంది ఇబ్బందులు పడుతున్నారన్నారు. అయితే ప్రత్యేక రాష్ట్రం సాధించుకున్నా.. అతి కొద్ది మంది చేతుల్లో రాష్ట్రం బందీ అయ్యిందన్నారు. తన స్వేచ్ఛను కోల్పోయిందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కంటే ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత వనరులు, సంపద దోపిడీకి గురయిందన్నారు. గత ప్రభుత్వాల హయాంలో పేదలకు భూములను పంచాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బీఎస్పీ పార్టీ అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, ప్రొఫెసర్ కంచె ఐలయ్య, మాజీ ఎంపీ మధుయాష్కి, గద్దర్ కుమార్తె వెన్నెల స్థానిక నేతలు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పర్వతారోహకులను సృష్టిస్తా..

● టార్క్ డైరెక్టర్ మలావత్ పూర్ణ


మాట్లాడుతున్న మలావత్ పూర్ణ

పటాన్‌చెరుటౌన్: భవిష్యత్‌లో మరో వెయ్యి మంది పూర్ణ (పర్వతారోహకు)లను సృష్టించాలనేది తన లక్ష్యమని, తనకు మద్దతునిచ్చిన సమాజానికి తిరిగి ఇవ్వాలనేదే తన ఆకాంక్ష అని ఎవరెస్ట్ పర్వతారోహకురాలు, ట్రాన్స్‌సెంట్ పర్వతారోహక శిక్షణ సంస్థ (టార్క్) డైరెక్టర్ మలావత్ పూర్ణ అన్నారు. 'అమృత్కాల్ విమర్స్ నికాసిత్ భారత్–2024' ప్రసంగలో భాగంగా 'విభిన్న అభివృద్ధి కార్యక్రమాలపై క్రీడల ప్రభావం, భారత విధానాలు' అనే అంశంపై బుధవారం ఉపన్యాసం చేశారు. యువతను, మరీ ముఖ్యంగా మహిళలు, బాలికలు వారి కలలను సాధించడానికి ప్రోత్సహించాలనే తన ప్రగాఢ వాంఛను వ్యక్తపరిచారు. స్పష్టమైన దృక్పథాన్ని కలిగి ఉండడం, ఎప్పటికీ వెన్ను చూపకపోవడం, సవాళ్లకు పరిష్కారాలను కనుగొనడం వంటి ప్రాముఖ్యతను వివరించారు.

వైద్య సేవలపై జాతీయ బృందం ఆరా


రికార్డులు పరిశీలిస్తున్న వైద్య బృందం

పటాన్‌చెరు టౌన్: ప్రభుత్వాస్పత్రిలో అందించే వైద్య సేవలపై లక్ష్య, ఎన్‌క్వాస్ కార్యక్రమంలో భాగంగా గోవా నుంచి ప్రముఖ వైద్యులు వినీలా ఎస్తేర్ ఫెర్నాండెజ్, మహారాష్ట్ర వైద్యులు ప్రశాంత్ బుధవారం పటాన్‌చెరు ఆస్పత్రిని పరిశీలించారు. ఆస్పత్రిలో ఉన్న సౌకర్యాలు, రోగులకు అందుతున్న వైద్య సేవలపై రికార్డులు పరిశీలించారు. రోగులతో కూడా మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైద్య ప్రమాణాలపై పరిశీలనకే రెండు రోజులుగా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. వీరి వెంట రాష్ట్ర వైద్యులు విజయలక్ష్మి, జిల్లా వైద్యులు రవి ఉన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ వసుంధర, ఆర్‌ఎం ప్రవీణ్ పాల్గొన్నారు.

బాల కార్మికులకు విముక్తి

● అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ వీరేశం

పటాన్‌చెరు టౌన్: బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ గొల్లపల్లి వీరేశం అన్నారు. ఆపరేషన్ స్మైల్–10లో భాగంగా బుధవారం అమీన్‌పూర్ పరిధిలోని బొమ్మను కుంటా పీఎస్‌ఆర్ బ్రిక్స్ వద్ద ఐదుగురు బాల కార్మికులతో పని చేయించడాన్ని గుర్తించారు. వెంటనే వారికి విముక్తి కల్పించి, నిర్వాహకుడు నర్సింహరావుపై పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

క్రెడిట్ కార్డు రద్దు పేరుతో సైబర్ మోసం..

పటాన్‌చెరు టౌన్: క్రెడిట్ కార్డు రద్దు పేరుతో ఓ వ్యక్తి నుంచి సైబర్ నేరగాళ్లు డబ్బులు కాజేసిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పటాన్‌చెరు అల్విన్ కాలనీకి చెందిన రాజు ప్రైవేటు ఉద్యోగి. ఆరోగ్య అవసరాలకు ఓ ప్రముఖ సంస్థ పేరుతో క్రెడిట్ కార్డు ఇచ్చారు. తనకు క్రెడిట్ కార్డు వద్దంటూ తిరిగి కస్టమర్ కేర్‌కి ఫోన్ చేసి అడిగితే రెండు నెలల వరకూ రద్దు చేయడం కుదరదని చెప్పారు. నాకు వద్దని చెబితే ఈ రెండు నెలలు లావాదేవీలు జరపొద్దని హోల్డ్‌లో పెడుతామని తెలిపారు. అనంతరం ఓ అపరిచిత వ్యక్తి ఫోన్ చేసి క్రెడిట్ కార్డు రద్దు చేస్తున్నాం.. నీకు వచ్చిన ఓటీపీ చెప్పమన్నారు. వెంటనే బాధితుడు ఓటీపీ చెప్పగానే క్రెడిట్ కార్డులో ఉన్న రూ.70 వేల లిమిట్ నుంచి రూ.67 వేలు కట్ అయ్యాయి. దీంతో బాధితుడు తాను మోసపోయినట్లు గ్రహించాడు. బుధవారం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పట్టపగలే దోచేస్తున్నారు

తాళం వేసిన ఇళ్లే టార్గెట్
- హుస్నాబాద్‌లో వరుస దొంగతనాలు
- పోలీసులకు సవాల్‌గా మారిన కేసులు
- నిద్రావస్థలో నిఘా నేత్రాలు
- భయాందోళనలో పట్టణవాసులు

సాధారణంగా దొంగతనాలు రాత్రి సమయాల్లో ఎక్కువగా జరుగుతాయి. కానీ హుస్నాబాద్ పట్టణంలో మాత్రం దొంగలు పట్టపగలే వీర విహారం చేస్తున్నారు. తాళం వేసిన ఇళ్లనే టార్గెట్ చేసుకొని బీభత్సం సృష్టిస్తున్నారు. దీంతో ప్రజలు పగటి వేళల్లో పనికి వెళ్లాలంటే భయపడుతున్నారు. దొంగతనాలు అదుపు చేయడం, దొంగలను పట్టుకోవడం కోసం ప్రత్యేకంగా సెంట్రల్ క్రైం స్టేషన్ సిబ్బందిని గ్రూపులుగా విభజించి కేసులు దర్యాప్తు చేస్తున్నా చోరీలు ఆగడం లేదు. – హుస్నాబాద్

హుస్నాబాద్ పట్టణంలో దాదాపు నెల రోజుల నుంచి వరుస దొంగతనాలు పోలీసులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. క్లూస్ టీమ్‌లతో వేలి ముద్రలు సేకరించి దొంగలను పట్టుకునే ప్రయత్నం చేస్తుండగానే, మరో చోట దొంగలు పడుతున్న ఘటనలు చోటు చేసుకుంటూనే ఉన్నాయి. గతంలో హుస్నాబాద్ పట్టణంలో ఎలాంటి ఆధారాలు దొరక్కుండా ఇంటిలో కారం పొడిచల్లి దొంగతనాలకు పాల్పడిన ఘటనలు ఉన్నాయి. ఏ సమయంలో ఇంటి నుంచి జనం బయటకు వెళ్తున్నారు.. మళ్లీ ఎప్పుడు వస్తున్నారు.. ఇంటి తాళాలు ఎక్కడ పెడుతున్నారని.. రెక్కీ నిర్వహించి మరీ ఇంటి తాళాలు పగులగొట్టి దర్జాగా దొంగతనాలకు పాల్పడుతున్నారు.


హుస్నాబాద్ పట్టణంలో ఓ ఇంటిలో వేలి ముద్రలను సేకరిస్తున్న క్లూస్ టీమ్ సిబ్బంది

ఇటీవల జరిగిన కొన్ని దొంగతనాలు..


సీసీ కెమెరాలో రికార్డు అయిన దొంగ

◆ హుస్నాబాద్ పట్టణంలో జనవరి 5వ తేదీన ఏక కాలంలో రెండు ఇళ్లల్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. పట్టణంలోని రావూస్ కాలనీకి చెందిన ఆటో మొబైల్ దుకాణం యజమాని పెద్ది రవీందర్, భార్య ఇద్దరు ఉదయం ఇంటికి తాళం వేసి దుకాణానికి వెళ్లారు. మధ్యాహ్నం సమయంలో టిఫిన్ తెచ్చేందుకు రవీందర్ ఇంటికి రాగా తాళం పగుల గొట్టారు. బీరువాలోని బట్టలను చెల్లా చెదురుగా చేసి 5 తులాల బంగారం, రూ.50 వేల నగదును దొంగలు ఎత్తుకెళ్లారు.

◆ ఇదేరోజు మరో చోరీలో.. పట్టణంలోని కాయిత విశాల్ మొబైల్ షాపును నడుపున్నాడు. సాయంత్రం ఇంటికొచ్చి చూడగా తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఇంటిలోకి వెళ్లి చూడగా బీరువాలోని 2 తులాల బంగారం, రూ.1.50 లక్షలు దొంగలించారు.

◆ హుస్నాబాద్ పట్టణంలో ఈ నెల 30న ముదిరాజ్ కాలనీలో వెల్దండి రాజేంద్ర ప్రసాద్ ఇంటికి తాళం వేసి పనుల నిమిత్తం బయటకు వెళ్లారు. అతడి భార్య వేరే ఊరికి వెళ్లింది. రాజేంద్ర ప్రసాద్ సాయంత్రం 5 గంటలకు ఇంటికొచ్చే సరికి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. బీరువాలో ఉన్న 8 తులాల బంగారం, రూ.60 వేల నగదును చోరీ చేశారు.

◆ పట్టణంలోని పాత శివాలయంలో వెనుక వీధిలో బుధవారం వంగర రాజిరెడ్డి ఆరోగ్యం సరిగా లేకపోవడంతో రెండు రోజుల క్రితం సొంత ఊరైన సముద్రాలకు వెళ్లారు. ఇంటి తలుపులు పగులగొట్టి ఉండడాన్ని గమనించిన స్థానికులు రాజిరెడ్డికి సమాచారం అందించారు. వెంటనే రాజిరెడ్డి భార్య ఇంటికొచ్చి చూడగా బీరువాలోని 2 తులాల బంగారం, రూ.లక్ష నగదును దొంగలు ఎత్తుకెళ్లారు.

సీసీ కెమెరాలపై అవగాహన


అంబేడ్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

హుస్నాబాద్ పట్టణంలో కమ్యూనిటీ పర్పస్ కింద 70 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయగా, అందులో 53 కెమెరాలు పని చేయడం లేదు. నేను సైతం కింద 69 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయగా, వీటిలో 25 పని చేయడం లేదు. ఒక్క సీసీ కెమెరా వంద పోలీసులతో సమానమని చెప్పుకుంటున్నప్పటికీ పట్టణంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో సగం నిద్రావస్థలోనే ఉన్నాయి. సీసీ కెమెరాల ద్వారా దొంగతనాలను పూర్తిగా అరికట్టవచ్చని పోలీసులు అవగాహన కల్పిస్తున్న ప్రజల్లో గాని, వ్యాపారుల్లో గాని చలనం రావడం లేదు. దాతల సాయంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసిన ఏజెన్సీ నిర్వాహకులు ఏడాది కాలం వరకు వాటి నిర్వహణ బాధ్యతను తీసుకుంటున్నారు. దాని తర్వాత పట్టించుకోవడం లేదు. పట్టణంలోని ప్రధాన రహదారుల వద్ద ఉన్న పలు వాణిజ్య, వ్యాపారులకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పోలీస్‌లు నోటీస్‌లు జారీ చేశారు.

ఐడీ పార్టీ సిబ్బంది అప్రమత్తం



ప్రజా భద్రతకు అందరూ సహకరించాలి. ప్రతీ వీధిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అవగాహన కల్పిస్తున్నాం. దొంగతనాలను నివారించేందుకు ఐడీ పార్టీ సిబ్బందిని అప్రమత్తం చేశాం. ప్రతీ నిత్యం పట్టణంలో గస్తీ తిరిగేలా సిబ్బందిని నియమించి ముమ్మరంగా గాలింపు చర్యలు చేపడుతున్నాం. ఇటీవల జరిగిన దొంగతనాలు చేసింది ఒక్కరేనని గుర్తించాం. త్వరలోనే దొంగను పట్టుకుంటాం. వీధుల్లో అనుమానితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలి.
– తోట మహేశ్, ఎస్సై, హుస్నాబాద్


బెల్లం బుట్టలతో భక్తులు

వనదేవతలకు 'బంగారం' మొక్కులు


ఎత్తు బెల్లం తూకం వేసుకుంటున్న మహిళ


తూకం వేసుకుంటున్న కొత్త జంట

- మేడారం బాట
- దుకాణాల వద్ద సందడి
- సమ్మక్క సారలమ్మలకు బంగారం సమర్పణ

హుస్నాబాద్: ప్రతీ రెండేళ్లకు ఒకసారి జరిగే మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు మొక్కులు తీర్చుకునే సమయం రానే వచ్చింది. కోరిన కోర్కెలు తీర్చాలని అడవి దేవతలకు నిలువెత్తు (బెల్లం)బంగారం సమర్పించడం భక్తుల ఆనవాయితీ. బుధవారం పట్టణంలో సమ్మక్క సారలమ్మలకు మొక్కులు తీర్చేందుకు కొత్త బట్టలు ధరించి ఎత్తు బంగారంతో భక్తులు సందడి చేశారు. బెల్లం దుకాణాల వద్ద ఏర్పాటు చేసిన తూకంకు, సమ్మక్క సారలమ్మ దేవతల చిత్ర పటాలకు పూజలు చేసి ఎత్తు బంగారం తూకం వేశారు. అశ్విత అనే అమ్మాయికి ఉద్యోగం వచ్చిన వేళ ఎత్తు బంగారం చెల్లించగా, శ్రీ లక్ష్మి వివాహమైన సందర్భంగా అమ్మవార్లకు ఎత్తు బంగారంతో మొక్కులు చెల్లించుకుంటున్నారు. బెల్లం సమర్పించే ముందు అందులో కొంచె ఇంటి వద్ద పంచుతారు. ఏ దుకాణం చూసిన బెల్లం బుట్టలు దర్శనమిస్తున్నాయి. బెల్లం కిలో రూ.36 ఉండగా, చక్కెర కిలోకు రూ.39 ధర పలుకుతుంది.

గంజాయి చాక్‌లెట్లు పట్టివేత


చేర్యాల(సిద్దిపేట) : నిందితుడితో పోలీసులు


హత్నూర(సంగారెడ్డి): గంజాయి ప్యాకెట్లు

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలో అక్రమంగా నిల్వ ఉంచిన 6 కిలోల గంజాయి చాక్‌లెట్లను పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ మహేంద్రకుమార్ తెలిపారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. స్థానిక బస్టాండ్ సమీపంలో ఓ పాన్ షాప్‌లో గంజాయి చాక్‌లెట్లు అమ్ముతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు సిబ్బందితో తనిఖీ చేశామన్నారు. షాప్ నిర్వాహకుడు బీహార్ రాష్ట్రానికి చెందిన రాకేష్ కుమార్ ఉంటున్న గదిలో 6 కిలోల బరువు గల 1,200 గంజాయి చాక్‌లెట్లు లభ్యమైనట్లు తెలిపారు. చాక్‌లెట్లతోపాటు వ్యక్తిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. తనిఖీల్లో ఎస్‌ఐలు సురేశ్, వినోద్ కుమార్, సిబ్బంది రవి, శ్రీకాంత్, ఫరీద్, నర్సింహులు, తదితరులు పాల్గొన్నట్లు తెలిపారు.

కిలో ఎండు గంజాయి స్వాధీనం..

హత్నూర(సంగారెడ్డి): గుట్టుచప్పుడు కాకుండా గంజాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు సీఐ వేణు కుమార్ ఎస్సై సుభాష్ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. హత్నూర మండలం మల్కాపూర్ గ్రామ శివారులోని వీఎస్‌ఆర్ గార్డెన్ ఆవరణలో బీహార్ రాష్ట్రానికి చెందిన ప్రేమ్ కుమార్ కుటుంబంతో 15 ఏళ్ల నుంచి నివాసం ఉంటున్నాడు. స్థానిక పరిశ్రమలలో పని చేసే కార్మికులకు, యువతకు గుట్టుచప్పుడు కాకుండా గంజాయిని సరఫరా చేస్తున్నారన్న సమాచారంతో బుధవారం ప్రేమ్ రాజ్ నివాసముంటున్న రేకుల షెడ్డులో సోదాలు నిర్వహించాం. కిలో ఎండు గంజాయి ప్యాకెట్లు, చాక్లెట్ల మాదిరి మరికొన్ని ప్యాకెట్లు లభించాయి. వెంటనే ప్రేమ్‌కుమార్‌ను అరెస్ట్ చేసి, గంజాయి స్వాధీనం చేసుకున్నామని, వాటి విలువ రూ.20 వేలు ఉంటుందని ఎస్‌ఐ తెలిపారు. నిందితుడి కుటుంబీకులు స్థానిక పరిశ్రమలకు క్యాటరింగ్ ద్వారా భోజనాన్ని సరఫరా చేస్తున్నారని పేర్కొన్నారు. ఎవరైనా గంజాయిని విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే సమాచారం అందించాలని ఎస్సై ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ఆభరణాల చోరీ నిందితుడు అరెస్ట్

● వివరాలు వెల్లడించిన సిద్దిపేట సీపీ అనురాధ

గజ్వేల్‌రూరల్: మహిళ మెడలో ఉన్న బంగారు ఆభరణాలను చోరీ చేయడంతోపాటు హత్యకు పాల్పడిన నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిద్దిపేట సీపీ డాక్టర్ బి. అనురాధ వెల్లడించారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. గజ్వేల్ పట్టణంలోని పాతబస్తీ ప్రాంతానికి చెందిన సుంకరి భాను ఇస్త్రీ షాపు పెట్టుకొని జీవిస్తున్నాడు. మద్యం, కల్లుకు బానిసైన ఇతడు సులువుగా డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. ఇటీవల జరిగిన ఎన్నికల సమయంలో గజ్వేల్ పట్టణంలోని కౌన్సిలర్ చందన భర్త రవీందర్‌కు ఫోన్‌కు చేసి నాకు డబ్బులు ఇవ్వాలని, లేని పక్షంలో కుటుంబ సభ్యులను చంపేస్తానంటూ బెదిరించాడు. ఈ విషయంలో నిందితుడు భానుపై గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. కేసు కొనసాగుతుండగానే భాను ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం కల్లు తాగడానికి కొల్గూరుకు వచ్చేవాడు. అక్కడే ఉన్న చెన్న శ్యామలత–శ్రీనివాస్‌ల కిరాణా దుకాణంలో సిగరెట్ తీసుకునేవాడు. వృద్ధురాలైన శ్యామలత ఒంటిపై బంగారు ఆభరణాలు చూసి దొంగతనం చేయాలనుకున్నాడు. పథకం ప్రకారం జనవరి 26వ తేదీన తెల్లవారు జామున శ్యామలత ఇంట్లోకి చొరబడి దుకాణంలోని కౌంటర్‌లోగల డబ్బులను దొంగిలించడంతోపాటు ఆమె బాత్‌రూమ్ నుంచి ఇంట్లోకి వస్తుండగా మెడలోంచి బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లాడు. ఈ ఘటనలో ఆమెకు గాయాలు కాగా, ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఏసీపీ రమేశ్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి బుధవారం భానును గజ్వేల్‌లో అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి మూడున్నర తులాల బంగారు పుస్తెలతాడు, చెవి కమ్మలతో పాటు రూ. 54 వేల నగదును స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు పంపించినట్లు తెలిపారు.

10 మేకలు మృత్యువాత



కోహీర్(జహీరాబాద్): యూరియా కలిపిన నీరు తాగి మేకలు మృతి చెందాయి. ఈ ఘటన మండలంలోని ఖానాపూర్ గ్రామ శివారులో బుధవారం చోటుచేసుకుంది. బాధిత రైతు హన్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం ఉదయం మేకలను తోలుకొని అడవికి వెళ్లాను. మేకలకు దప్పిక కావడంతో మధ్యాహ్నం దగ్గరలోని కవేలి మొగులయ్య బోరుబావికి తీసుకెళ్లగా పక్కనే బకిట్లో కలిపి ఉంచిన యూరియా నీటిని తాగాయి. గమనించి వెంటనే చికిత్స కోసం మేకలను ఇంటికి తరలిస్తుండగా నిమిషాల వ్యవధిలో 10 మేకలు మృతి చెందినట్లు తెలిపారు. తనను ఆదుకోవాలని హన్మయ్య వేడుకుంటున్నాడు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జరిమానా

● ఒకరికి జైలు, నలుగురికి రూ.10 వేలు

సంగారెడ్డి: మద్యం సేవించి వాహనాలు డ్రైవింగ్ చేస్తే సహించేది లేదని ఎస్పీ రూపేశ్ హెచ్చరించారు. డ్రంకెన్ డ్రైవ్‌లో భాగంగా మద్యం సేవించి వాహనం నడుపుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వీరిని బుధవారం కోర్టులో హాజరుపర్చగా ఒకరికి ఐదు రోజులు జైలు, నలుగురికి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ మార్నింగ్ కోర్ట్ మెజిస్ట్రేట్ తేజస్వి తీర్పునిచ్చినట్లు వెల్లడించారు.

నేపాల్‌లో బండారుపల్లి వాసి మృతి

తొగుట(దుబ్బాక): మండలంలోని బండారుపల్లి గ్రామానికి చెందిన జంగపల్లి శేఖర్ (36) నేపాల్‌లో గుండెపోటుతో మృతిచెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, కుటుంబీకుల కథనం మేరకు.. శేఖర్ తన మిత్రులతో కలిసి శనివారం నేపాల్‌కు వెళ్లాడు. మంగళవారం ఉదయం శేఖర్‌కు గుండెపోటు రావడంతో మిత్రులు చికిత్స కోసం అక్కడి ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ అదే రోజు మృతి చెందాడు. మృతుడికి భార్య అనిత, కుమారుడు సాయి వర్షిత్, కూతురు సహస్ర ఉన్నారు.

సమాచారం లేకుండా డబ్బులు డ్రా

సర్పంచ్‌పై ఎంపీడీఓకు ఉప సర్పంచ్ ఫిర్యాదు


ఎంపీడీఓకు వినతిపత్రం అందిస్తున్న మల్లేశం

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఉప సర్పంచ్‌కు సమాచారం లేకుండా గ్రామ పంచాయతీ ఖాతా నుంచి డబ్బులు డ్రా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం ఎంపీడీఓ పట్టాభి రామారావుకు జగదేవ్‌పూర్ ఉపసర్పంచ్ బింగి మల్లేశం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ మల్లేశం మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం నుంచి పంచాయతీలకు వచ్చే అభివృద్ధి పనుల డబ్బులను తమకు సమాచారం లేకుండానే బ్యాంకు నుంచి సర్పంచ్ డ్రా చేశారని ఆరోపించారు. ఏడో నెలలో తాము చేసిన పనులకు బిల్లులు రావడం లేదని డీఎల్‌పీఓకు విన్నవించగా, స్పందించి తన వద్ద ఉన్న పెన్‌డ్రైవ్‌ను ఇవ్వమని కోరగా ఇచ్చినట్లు తెలిపారు. అప్పటి నుంచి తమకు ఓటీపీ రావడం లేదన్నారు. తనకు అనుమానం వచ్చి కార్యదర్శిని అడుగగా ఐదు నెలలుగా ఎంబీ రికార్డులు ఉన్నా పనులకు బిల్లులు చేసుకొని సర్పంచ్, వార్డు సభ్యులు డబ్బులు తీసుకున్నట్లు తెలిపారని వివరించారు. సుమారు రూ.25 నుంచి రూ.30 లక్షల వరకు డ్రా చేసుకున్నారని ఉపసర్పంచ్ ఆరోపించారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై సర్పంచ్ లక్ష్మీ శ్రీనివాస్‌రెడ్డిని వివరణ కోరగా చేసిన పనులకు రికార్డులు చేసి బిల్లులు తీసుకున్నానని, ఉప సర్పంచ్ ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదని ఖండించారు.

వానరం.. ప్రత్యేక వనం

- కోతుల కోసం 'మంకీ ఫుడ్ కోర్టు'
- పద్మనాభునిపల్లిలో పండ్ల తోట సాగు
- గ్రామ శివారులో మూడు ఎకరాల స్థలం
- తగ్గిన వానరుల బెడద

దుబ్బాకరూరల్ : ఎక్కడ చూసిన కోతుల బెడదతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అడవుల్లో ఉండాల్సిన కోతులు సరైన ఆహారం దొరక్క గ్రామాల్లోకి, పట్టణాల్లోకి వస్తున్నాయి. ఏకంగా ఇళ్లలోకి వచ్చి చొరబడి ఆహార పదార్థాలను ఎత్తుకెళ్తున్నాయి. దీంతో కోతుల బెడదను తప్పించడానికి దుబ్బాక మండలం పద్మనాభునిపల్లి గ్రామస్తులు వినూత్నంగా ఆలోచించారు. గ్రామస్తులంగా ఏకమై గ్రామ శివారులో ప్రత్యేకించి కోతుల కోసం 'మంకీ ఫుడ్ కోర్టు' ఏర్పాటు చేశారు. పంచాయతీ ఆధ్వర్యంలో 3 ఎకరాల భూమిని ఎంచుకొని పలు రకాల పండ్ల మొక్కలు పెంచుతున్నారు.

కొండెంగలను తిప్పుతూ..

గ్రామాల్లో కోతుల బెడద ఎక్కువ కావడంతో ప్రజలు, రైతుల నానా అవస్థలు పడుతున్నారు. పొలాల వద్ద రైతులు వేసిన కూరగాయల పంటలు, ఇతర ఆహార పంటలను నాశనం చేస్తున్నాయి. దీంతో తీవ్ర స్థాయిలో నష్ట పోతున్నారు. పంటలను రక్షించుకోవడానికి పొలాల వద్ద వాయిస్‌తో కూడిన అలారం ఏర్పాటు చేశారు. కొంత మంది డప్పు చప్పుళ్లు, టపాసులు కాల్చుతున్నారు. గ్రామాల్లోని రైతులు వేల రూపాయలు ఖర్చు పెట్టి కొండెంగలను కొనుగోలు చేసి తిప్పుతున్నారు. మనిషిని ఏర్పాటు చేసి ప్రతీనెలా జీతం ఇస్తున్నారు.


గుంపులుగా తిరుగుతున్న కోతులు

నాలుగేళ్లుగా పండ్ల తోట..

కోతుల బెడదను తప్పించడానికి పద్మనాభునిపల్లి గ్రామస్తులంతా ఏకమై ఒక నిర్ణయానికి వచ్చారు. గ్రామ శివారులో వానరుల ఆహారం కోసం మంకీ ఫుడ్ కోర్టు ఏర్పాటు చేస్తే వాటి బెడద తగ్గుతుందని ఆలోచించారు. దీంతో ఊరి శివారులో పండ్ల తోటను ఏర్పాటు చేశారు. నాలుగేళ్ల నుంచి మొక్కలను నాటుతూనే ఉన్నారు. వాటికి నీళ్లు పోసేందుకు ప్రత్యేకించి మనిషిని ఏర్పాటు చేసి ప్రతి నెలా జీతం చెల్లిస్తున్నారు. మామిడి, జామ, దానిమ్మ, సపోట, సీతాఫలం, రేగుపండ్లు, బొప్పాయి, సంత్రాలు, అరటి, బత్తాయి, అల్లనేరేడు, వెలిగుపండ్లు, కర్బుజ, దోస తదితర పండ్ల మొక్కలను పెంచుతున్నారు.


మంకీఫుడ్ కోర్టులో పెరుగుతున్న పండ్ల మొక్కలు

పండ్ల మొక్కలు నాటాం



కోతుల బెడద నుంచి తప్పించుకోవడానికి వాటికి ఆహారంగా పలు రకాల పండ్ల మొక్కలు పెంచుతున్నాం. ప్రతీ సీజనల్ కాలంలో కాసే పండ్ల మొక్కలు నాటాం. ఏర్పాటు చేసి నాలుగేళ్లు అవుతుంది. మూడు ఎకరాల్లో పండ్ల తోటలను సాగు చేస్తున్నాం. దీంతో కోతుల బెడద తగ్గింది.
– పర్శరాములు, గ్రామ సర్పంచ్

భూ తగాదాలు తట్టుకోలేక ఆత్మహత్య


నారాయణరెడ్డి(ఫైల్)

అక్కన్నపేట(హుస్నాబాద్): భూ తగాదాలు తట్టుకోలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన అక్కన్నపేట మండలం కట్కూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై తాండ్ర వివేక్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జిల్లెల్ల నారాయణరెడ్డి(73), ఇతడి తమ్ముడు రాజిరెడ్డికి మధ్య కొంతకాలంగా భూ తగాదాలు జరుగుతున్నాయి. మంగళవారం రాత్రి ఇద్దరి మధ్య తీవ్ర వివాదం తలెత్తింది. ఈ నేపథ్యంలో మనస్తాపానికి గురైన నారాయణరెడ్డి పురుగుల మందు చెవిలో పోసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం కుటుంబసభ్యులు చూసేసరికి మృతి చెంది ఉన్నాడు. భార్య సుశీల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివేక్ పేర్కొన్నారు.